క్లుప్తంగా

బాధ్యతాయుతంగా పనిచేయాలి



నియామకపత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : నూతనంగా ఎన్నికైన వార్డు వలంటీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నియమించిన 13 మంది వలంటీర్లకు నియామక పత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ అందించారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతం

బి.కోడూరు : మండలంలోని దంతెలపల్లె గ్రామంలో వెలసిన శ్రీఅచలానంద ఆశ్రమ పాలిత శ్రీరమా సహిత శ్రీసత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 5వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

దుస్తులు, కుట్టుమిషన్ల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 154 మంది విద్యార్థులకు, మదర్‌థెరిస్సా చర్చి విచారణ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 160 మంది వృద్ధులకు ఉచితంగా దుస్తులు, అలాగే వీరప్పల్లిలోని మైత్రి సదన్ కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 15 మంది యువతులకు సంస్థ ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి ఉచితంగా దుస్తులు, కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో మదర్‌థెరిస్సా చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ ఎల్.ఆరోగ్యరాజు, మైత్రి సదన్ కుట్టు శిక్షణ నిర్వాహకులు రెవ. సిస్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నైట్ విజన్‌తో పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ



విద్యార్థి సందేహాన్ని నివృత్తి చేస్తున్న హెడ్మాస్టర్ ఆవుల శ్రీనివాసులు

మైదుకూరు : పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు నైట్ విజన్ పేరుతో హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మండలంలోని జీవీ సత్రం హైస్కూల్ హెడ్మాస్టర్ ఆవుల శ్రీనివాసులు ఉపాధ్యాయులతో కలిసి రాత్రి వేళ పదో తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళుతున్నారు. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు. పిల్లలు బాగా చదివేలా ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నైట్ విజన్‌తో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్టు హెడ్మాస్టర్ ఆవుల శ్రీనివాసులు తెలిపారు.

రికార్డుల తనిఖీ

కడప అర్బన్ : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను ఓపికతో విని పరిష్కరించాలని కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి తెలియజేశారు. శనివారం కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ లాంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కేసులకు సంబంధించిన రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. సీఐ ఉలసయ్య, ఎస్ఐ తాహీర్‌హుసేన్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

6న చలో కలెక్టరేట్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అంగన్వాడీల సమస్యలపై ఈ నెల 6న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచి ప్రభుత్వమే గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. దీంతో పాటు ఆయా సమస్యలపై నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రభుత్వ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులను వెంట పెట్టుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రతి కుటుంబంతో మాట్లాడి.. వారు సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని వివరించారు. ఇదే క్రమంలో గ్రామంలోని సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపేల్‌రెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, జెడ్పీటీసీ రాజీ భర్త శాంతురాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చాపాటి రాజశేఖర్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, దువ్వూరు ఎంపీపీ జయచంద్రారెడ్డి, సర్పంచ్ పీరయ్య, ఎంపీటీసీ సీమోన్, రాష్ట్ర కార్యదర్శి శంకర్‌రెడ్డి, పీపీ రమణారెడ్డి, మడూరు వినయ్‌కుమార్‌రెడ్డి, జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకట్‌రెడ్డి, పల్లవోలు రమణయ్య, గందం శ్రీను, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్, మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

అన్నవరం గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయ సలహాదారు తిరుపేల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, వ్యవసాయాధికారి మ్యాగీ, పంచాయతీ రాజ్ ఏఈ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి గొర్రె శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ మహబూబ్ బాషా, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలోనే అమృతానగర్ అభివృద్ధి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ బావుటా అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జగన్ ప్రభుత్వంలోనే కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతానగర్‌లో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. అమృతానగర్‌లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాను వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల వివరాల సంక్షేమ బావుట బుక్‌లెట్‌ను ప్రజలకు ఎమ్మెల్యే అందించారు. రోడ్లు, కాలువలు నిర్మించడంతోపాటు వీధి లైట్లు వేయాలని ఎమ్మెల్యేకు ప్రజలకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ఎంపీటీసీ భాగ్యమ్మ, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాజీ ద్వారా కేసుల పరిష్కారం రాజ మార్గం

- 11న జాతీయ లోక్ అదాలత్
- న్యాయమూర్తి ఖాజామొయినుద్దీన్



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఖాజా మొయినుద్దీన్

మైదుకూరు : రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం రాజ మార్గమని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో బ్యాంకు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల వల్ల సమయం, డబ్బు వృథా కావడమే కాక, మనుషుల మధ్య దూరం పెరుగుతుందన్నారు. అందువల్ల ఈనెల 11న కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై సంబంధిత అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రాముడు, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, చాపాడు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ, సహాయ ప్రభుత్వ ప్లీడర్ జ్వాలా నరసింహశర్మ, కోర్టు సిబ్బంది రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సంస్కారం ఉండాలి

చదువుతోపాటు సంస్కారం ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. శ్రీభారతి జూనియర్ కాలేజీలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కళాశాల యజమాని బండి రామచంద్ర న్యాయమూర్తిని పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జేకే చారి, నానుబాల శ్రీను, ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నియంత్రణ సాధ్యమే



ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సాధ్యమవుతుందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న దొరసానిపల్లెలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పొగాకు వాడకం క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదముందని వివరించారు. డాక్టర్ సుబ్రమణ్యం, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ వరప్రసాద్, ఆరోగ్య సిబ్బంది శ్రీను, దివ్యలక్ష్మి, సుప్రజ, ఆశా కార్యకర్తలు సుజాత, పుష్ప పాల్గొన్నారు.

వైఎంఆర్ కాలనీ ఆరోగ్య కేంద్రంలో

స్థానిక వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సునీల్‌కుమార్, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో శనివారం ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు ప్రతిమ దేశాయ్, సల్మా ఫరోజ్ హాజరయ్యారు. ప్రపంచలో నేడు కేన్సర్ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారని, ఓజోన్ పొర దెబ్బతినటం, ఆహార లోపం వల్ల కేన్సర్ బారిన పడుతున్నారని వైద్యులు తెలిపారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విస్తృత ప్రచారం



రామచంద్రారెడ్డికి సంఘీభావం తెలుపుతున్న వివిధ ఉపాధ్యాయ సంఘాల, ప్రైవేటు పాఠశాలల నాయకులు

బద్వేలు అర్బన్ : త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.వి.రామచంద్రారెడ్డి వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేటు పాఠశాలల యూనియన్ నాయకులతో కలిసి శనివారం బద్వేలు, గోపవరం మండలాల్లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ తిరుపాల్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిశంకర్, శివారెడ్డి, గౌరవాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, అపుస్మా జిల్లా నాయకులు శంకర్‌రెడ్డి, రత్నం, పీఎస్‌టీయూ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, అనిల్, స్థానిక నాయకులు, వివిధ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గృహసారథుల శిక్షణ షెడ్యూల్

బద్వేలు : నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సంబంధించి గృహసారథుల శిక్షణ షెడ్యూల్‌ను పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే బద్వేలు, పోరుమామిళ్ల మండలాల శిక్షణ ముగిసింది. ఆదివారం ఉదయం 9 గంటలకు గోపవరం మండల సారథులకు పీపీకుంట వద్ద, అట్లూరు మండల సారథులకు మధ్యాహ్నం మూడు గంటలకు కుంభగిరిలోని మల్లికార్జునరెడ్డి తోటలో ఉంటుంది. సోమవారం ఉదయం 9 గంటలకు బి.కోడూరు మండల సారథులకు మండల కేంద్రంలో, మధ్యాహ్నం మూడు గంటలకు బద్వేల్ రూరల్ మండల సారథులకు మున్సిపాలిటీలో శిక్షణ ఉంటుంది. మంగళవారం కలసపాడు మండల సారథులకు ఉదయం, కాశినాయన మండల సారథులకు మధ్యాహ్నం శిక్షణ ఉంటుంది.

వైభవంగా గ్రామోత్సవం

కలసపాడు : కలసపాడులో శనివారం పోలేరమ్మ, పోతురాజుస్వామి, నాగదేవత, సుబ్రమణ్యస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా శనివారం విగ్రహాలను పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించారు. గ్రామోత్సవం వెంట బి.కోడూరు మండలం సిరిగిరిపల్లె గ్రామానికి చెందిన కె.నారాయణరెడ్డి భజన బృందం, అలాగే గంగనపల్లె, నరసాపురం గ్రామాలకు చెందిన కోలాట బృందాలు వేసిన కోలాటాలు అలరించాయి. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఐడీపీఎస్ విద్యార్థి షేక్ అసిఫా

చాపాడు : 30వ జాతీయ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌లో స్థానిక ఐడీపీఎస్ విద్యార్థి ప్రతిభ కనబరిచారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నోడల్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐడీపీఎస్ విద్యార్థి షేక్ అసిఫా సంక్లిటి టు క్లారిటీ అనే అంశంపై ఇచ్చిన ప్రాజెక్టు జాతీయ స్థాయి శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించిందని డైరెక్టర్ లోహిత్‌రెడ్డి తెలిపారు. 9 దేశాల నుంచి వచ్చిన 650 మంది విద్యార్థులలో ఐడీపీఎస్‌లో 9వ తరగతి చదువుతున్న షేక్ అసిఫా తాను చేసిన ప్రాజెక్టు గురించి అనర్గళంగా చెప్పి ప్రశంసా పత్రం అందుకుంది. షేక్ ఆసిఫా గతేడాది డిసెంబరు 10, 11 తేదీలలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయిలో టాప్ టెన్‌లో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. తమ పాఠశాల విద్యార్థి సాధించిన ప్రతిభ పట్ల కరస్పాండెంటు వి.జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చాపాడు : చాపాడు గ్రామానికి చెందిన హైకోర్టు రిటైర్డు జడ్జి రాజోలి బయపురెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబీకులు మండల పరిధి పల్లవోలు గ్రామ సమీపంలోని శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో బయపురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు వీఆర్వో మనోహర్‌రెడ్డి, రాజోలి ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జోగిరెడ్డి, మనోహర్‌రెడ్డి, సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే, ఎన్నికల పరిశీలకులు

ప్రొద్దుటూరు : ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అందుకోసమే మరో మారు జగనన్నను ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఇంటింటికి వెళ్లి అడుగుదామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24 నుంచి 46 వార్డు సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు స్థానిక శేగిరెడ్డి కాటిరెడ్డి కళ్యాణ మండపంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవే మార్గంగా మన ప్రభుత్వం పనిచేసిందన్నారు. చంద్రబాబు పాలనకు, జగనన్న పాలనకు వెయ్యి రెట్లు తేడా ఉందన్నారు. దళారి వ్యవస్థ లేకుండా, పలుకుబడి అవసరం లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించామన్నారు. 175కు 175 అసెంబ్లీ సీట్లు కొట్టాలి, జగనన్న మాట నిలబెట్టాలి అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గం పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందు వరసలో ఉందని ప్రశంసించారు. ఈనెల 11 నుంచి నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించుకుందామని తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని తానే బలపరిచా

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని ముఖ్యమంత్రి వద్ద తాను బలపరిచానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో 15వేల ఓట్లు నమోదయ్యాయని, గడపగడపకు తిరిగి రవీంద్రారెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనపైనే ఎక్కువగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, పట్టణ కన్వీనర్ల ఇన్‌చార్జిలు పోసా భాస్కర్, కాకర్ల నాగేషారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి కల్లూరు నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

గృహ సారథులు.. జగనన్న సైనికులు



జగనన్న కిట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ, తదితరులు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

బద్వేలు : సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు రానున్న ఎన్నికల్లో జగనన్న సైనికులులా పని చేసి, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని వైస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, నియోజకవర్గ పరిశీలకులు జగన్‌మోహన్‌రెడ్డిలు అన్నారు. శనివారం పోరుమామిళ్ల మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమం రంగసముద్రం పంచాయతీలోని పద్మావతి కల్యాణ మండపంలో జరిగింది. నియోజకవర్గంలో 4 వేల మంది పార్టీని నడిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహసారథులతో యంత్రాంగాన్ని తయారు చేసుకుంటున్నారని డీసీ గోవిందరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఈ సైన్యం ఏడు లక్షల వరకు ఉండగా నియోజకవర్గంలో నాలుగు వేల మందికి పైగా పార్టీ కోసం సైనికుల్లా పని చేస్తారని చెప్పారు. ఒక్కో సారథి వలంటీరు పరిధిలోని 25 ఇళ్లను ప్రతి నెలా సందర్శించి ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించాలన్నారు. 99 శాతం హామీల అమలు, వందలాది సంక్షేమ పథకాలు అమలు చేసిన జగనన్నపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే సుధ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సీఎం బాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, కన్వీనర్ల మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ శకునాల ఈశ్వరమ్మ, నాయకులు రాళ్లపల్లి నరసింహులు, అల్లా, వసంతరాయలు, చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి, చాపాటి సాయి, తదితరులు పాల్గొన్నారు.